తడబడి

వరండాలో ఒక తరగతి.. ప్రధానోపాధ్యాయుడి గదిలో మరో తరగతి.. సరిపడినన్ని గదులు లేక అక్కడక్కడే సర్దుకుంటూ హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సహా విద్యార్థులు పడుతున్న అవస్థలివి. చలికాలంలో, వరండాలో కూర్చుని వణుకుతున్న విద్యార్థుల పరిస్థితి దయనీయం. ఇక పాఠశాల పరిపాలనా వ్యవహారాలు చూడవలసిన ప్రధానోపాధ్యాయుడికి ప్రత్యేకమైన గదే లేని దుస్థితి. ఇదీ సంజీవినగర్ ప్రాథమిక పాఠశాల దీనస్థితి. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమైన అదనపు గదుల నిర్మాణం పూర్తయి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.. కానీ మధ్యలోనే నిర్మాణపనులు నిలిపివేయడంతో వచ్చిన సమస్య ఇదీ..

- శిథిలావస్థలో పాఠశాల భవనం
- అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణం
- వరండాలో ఒక తరగతి
- ప్రధానోపాధ్యాయుడి గదిలో మరొకటి
- దయనీయంగా సంజీవినగర్ పాఠశాల
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన



వరండాలో నిర్వహిస్తున్న తరగతి



ప్రధానోపాధ్యాయుడి గదిలో నిర్వహిస్తున్న తరగతి

ఆరిలోవ: ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు శిథిల స్థితికి చేర్చుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై చిన్నచూపు వహిస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను సైతం మధ్యలోనే నిలిపేశారు. దీనికి జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ ప్రాంతం సంజీవినగర్‌లో ప్రభుత్వ పాఠశాలే నిదర్శనం.

సంజీవి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండు భవనాలున్నాయి. వాటిలో ఒక భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబ్, గోడలు పెచ్చులూడిపోయాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ఇక్కడ 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 115 మంది ఉన్నారు. దీంతో గతంలో బాగున్న భవనంతో పాటు శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనూ ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించేవారు.

ఇదీ పరిస్థితి

- విద్యార్థుల సంఖ్య : 115
- మొత్తం తరగతులు : 5
- తరగతి గదులు : 4
- ఒక గది : అంగన్‌వాడీ కేంద్రం
- 3 గదుల్లో : 3 తరగతులు
- వరండాలో : 1 తరగతి
- హెచ్‌ఎం రూమ్‌లో : మరో తరగతి

వైఎస్సార్‌సీపీ హయాంలో అదనపు గదులకు శ్రీకారం



శిథిలమైన పాత భవనం

ఈ భవనం ప్రమాదకరంగా మారడాన్ని గమనించిన విద్యాశాఖ అధికారులు 2023–24లో నాడు–నాడు కింద బాగున్న భవనంపై మూడు గదుల నిర్మాణం చేపట్టారు. గదులు నిర్మాణ దశలో ఉండగానే ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో నాడు–నేడు పనులు నిలిపేయడంతో ఈ పాఠశాల అదనపు భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో ఉపాధ్యాయులు ఏడాది క్రితం విద్యాశాఖ అధికారుల సూచనలతో ఖాళీ చేశారు. అందులో నిర్వహించాల్సిన తరగతులను బాగున్న భవనం గదులలో సర్దుబాటు చేస్తున్నారు. తరగతి గదులు చాలకపోవడంతో ఒక తరగతిని వరండాలో నిర్వహిస్తున్నారు. అప్పటికీ మరో తరగతి మిగిలిపోవడంతో ప్రధానోపాధ్యాయుడి గదిలోనూ నిర్వహించాల్సి వస్తోంది. దీంతో ప్రధానోపాధ్యాయుడికి ప్రత్యేకంగా గది లేకుండా పోయింది.

'సర్దుబాటు'తో సాగని చదువులు

ఇక్కడ ప్రస్తుతం 5 తరగతుల్లో కలిపి మొత్తం 115 మంది విద్యార్థులున్నారు. ఇక్కడే ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఉన్న నాలుగు గదుల్లో ఒక గదిని అంగన్‌వాడీ కేంద్రానికి.. మూడు గదులను మూడు తరగతులకు కేటాయించారు. ఇక మిగిలిన రెండు తరగతులను హెచ్‌ఎం గదిలో ఒకటి, వరండాలో మరో తరగతి సర్దుబాటు చేసుకుని అరకొరగా నిర్వహిస్తున్నారు.

తల్లిదండ్రుల్లో ఆందోళన

శిథిలమైన భవనం ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు అటుగా వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు సైతం భయపడుతున్నారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే శిథిల భవనాన్ని తొలగించాలని, మధ్యలో నిలిచిపోయిన అదనపు భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే వారి చదువులు సాగేదెలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మధ్యలో నిలిచిన 'నాడు-నేడు' పనులు



మధ్యలో నిలిచిపోయిన అదనపు భవనం నిర్మాణం

ఈ పాఠశాలలో నాడు–నేడు కింద రూ.65 లక్షలతో అదనపు భవనంతో పాటు మరుగుదొడ్లు, తదితర అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా బాగున్న భవనంపైన ఓ శ్లాబ్ వేసి దానిలో మూడు గదుల నిర్మాణం చేపట్టారు. ఆ పనులు పూర్తి కాక ముందే కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఆ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఓ పక్కన శిథిలమైన భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. మరో పక్క ఉన్న తరగతి గదులు చాలడం లేదు.



మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ దంపతులు గొలగాని హరివెంకటకుమారి, గొలగాని శ్రీనివాస్

ఏయూలో న్యూ ఇయర్ వేడుకలు



వీసీ శశిభూషణరావుకు శుభాకాంక్షలు చెబుతున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఏయూ అధికారులు, ఉద్యోగులు వీసీకి, రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర సందడి కనిపించింది. ప్రతి విభాగంలో ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

మందుబాబులపై కేసుల నమోదు

బీచ్‌రోడ్డు : నూతన సంవత్సర వేడుకలు జరుపుకుని మద్యం సేవించి వాహనం నడుపుతున్న 17 మందిపై మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 17 మందిపై కేసులు నమోదు చేసి, శబ్ద కాలుష్యానికి కారణమైన సైలెన్సర్లు కలిసిన ఐదు వాహనాలపై కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

తాగునీరు వృథా



రహదారిపై లీకవుతున్న నీరు

ఏయూ క్యాంపస్ : రహదారిపై పైప్‌లైన్‌కు రంధ్రం పడడంతో వందల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. చినవాల్తేరు నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో స్పీడ్ బ్రేకర్ వద్ద పలు చోట్ల పైప్‌లైన్‌కు రంధ్రాలు పడ్డాయి. దీంతో నీరు వృథాగా రోడ్డు మీద ప్రవహిస్తోంది. రహదారి మొత్తం నీటితో నిండిపోవడంతో ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది దృష్టి సారించి, నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

మేయర్‌కు శుభాకాంక్షలు



మేయర్ హరివెంకట కుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న జీవీఎంసీ అధికారులు

ఆరిలోవ : నూతన సంవత్సరం సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి బుధవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్లు, పలువురు కార్పొరేటర్లు, పలు రాజకీయ పార్టీల నాయకులు, జీవీఎంసీలో వివిధ విభాగాల అధికారులు, జోనల్ అధికారులు ఆమెను కలిశారు. పూల బొకేలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం నుంచి ఆమెను కలవడానికి వచ్చిన అధికారులు, నాయకులతో మేయర్ క్యాంప్ కార్యాలయం సందడిగా మారింది. ఆమెకు జీవీఎంసీ అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్లు, సిటీ ప్లానర్, డీసీఆర్, యూసీడీ విభాగం అధికారులు, పర్యవేక్షక ఇంజినీర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'

దాబాగార్డెన్స్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను విమర్శించినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడంపై సీపీఎం మండిపడింది. కమ్యూనిస్టుల పిలుపు మేరకు గత నెల 30 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు.. నిరసనలు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పూర్ణామార్కెట్‌లో ముఠా కళాసీ యూనియన్ నాయకుడు ఎం. సుబ్బారావు నేతృత్వంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకుడు చంద్రమౌళి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసి యావత్ దేశ ప్రజలను ఆవేదనకు గురి చేశారని, అటువంటి వ్యక్తిపై ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మన్మథరావు, పైడిరాజు, ఆర్.నాయుడు, నర్సింగరావు, మహేష్, నారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గణపతి, సీతారాముల విగ్రహాలు

ఆరిలోవ : నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు బుధవారం ఆలయాలను సందర్శించారు. సంవత్సరం మొదటి రోజు కావడంతో అంతా మంచి జరగాలని కోరుకున్నారు. ఆరిలోవ ప్రాంతంలో విఘ్నేశ్వర, శివాలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాలు, దుర్గాదేవి మందిరాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు చేశారు. దీంతో ఆరిలోవ ప్రాంతంతోపాటు విశాలాక్షినగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల్లోని ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. సాధారణ భక్తులతోపాటు పలు పార్టీల రాజకీయ నాయకులు ఆలయాల్లో పూజలు చేశారు.

ఏయూ క్యాంపస్ : ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగర వాసులు దేవాలయాలను దర్శించుకున్నారు. కొత్త సంవత్సరంలో తమకు మంచి జరగాలని, ఆకాంక్షలు సాకారం కావాలని ప్రార్థించారు. ప్రత్యేక పూజలు చేశారు. తూర్పు నియోజకవర్గంలోని కనకమ్మ ఆలయం, కిర్లంపూడిలోని లలిత పీఠం, కోదండ రామాలయం తదితర ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష అలంకరణ







ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి, వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6 లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామిని విశ్వరూప అలంకరణ చేశారు. శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామిని వివిధ రకాల పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. దీంతోపాటు శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామిని వివిధ రంగుల ఊలు దండలతో అలంకరించారు. ప్రథమ ఆరాధన, తిరుప్పావై సేవా కాలం, తీర్థ, ప్రసాదగోష్ఠి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

నీల్ అముండ్‌సన్ విగ్రహం ఏర్పాటు



నీల్ అముండ్‌సన్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆధునిక కెమికల్ ఇంజినీరింగ్ పితామహుడు నీల్ అముండ్‌సన్ విగ్రహాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పూర్వ వీసీ పద్మశ్రీ జీడీ యాదవ్ ఆన్‌లైన్‌లో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ సంయుక్తంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీవీ లక్ష్మణరావు సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కెమికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరికీ నీల్ అముండ్‌సన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ యు.శ్రీదేవి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఆయిల్ టెక్నాలజీ ఇన్‌చార్జి హెడ్ డి.దామోదర్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ సీహెచ్ జయప్రకాషరెడ్డి, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, సీనియర్ లెక్చరర్ డాక్టర్ ఎం.విజయలక్ష్మి, జనరల్ విభాగం ఫిజిక్స్ లెక్చరర్ ఆర్.జ్యోతి పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం



శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారిలో ట్రావెల్ బస్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి శ్రీకాంత్ నగర్ ప్రధాన రహదారిలో ఓ ట్రావెల్ బస్ ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారి పక్కన రోజూ రాత్రి సమయంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ట్రావెల్ బస్సులు నిలుపుతుంటారు. ఇందులో భాగంగా మంగళవారం అర్ధరాత్రి ఓ ట్రావెల్ బస్‌ను రోడ్డు పక్కన నిలిపే క్రమంలో అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని డ్రైవర్ బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆ స్తంభం విరిగిపోయి రెండు ముక్కలైంది. అర్ధరాత్రి సమయం కావడంతో రహదారిలో వాహనచోదకులు ఎవ్వరూ లేకపోవడం పెద్ద ప్రమాదం తప్పింది. ఇక్కడ ట్రావెల్ బస్సులు నిలపడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల క్రితం ఓ రోజు తెల్లవారుజామున ఇక్కడి నుంచి నగరంలోకి బస్ తీసుకెళ్లేందుకు టర్న్ వేస్తుండగా వెనుక ఓ యాచకురాలి మీదకు దూసుకుపోయింది. దీంతో ఆమె సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది.

వేడుకలు చేసుకునే విధానమిదేనా..?



భోజనం ప్లేట్లతో నిండిపోయిన పార్క్ ప్రాంగణం



వ్యర్థాలతో నిండిన బీచ్‌రోడ్డులోని పార్క్

ఏయూక్యాంపస్: నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్న కొందరు విచక్షణా రహితంగా బీచ్‌రోడ్డులో వ్యర్థాలను వదిలేశారు. మంగళవారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెద్దసంఖ్యలో నగరవాసులు, పర్యాటకులు సముద్ర తీరానికి వచ్చారు. వీరిలో కొంతమంది స్నేహితులతో కలసి బీచ్‌లోని పచ్చికబయళ్లపై భోజనాలు చేశారు. వీరు తమ వెంట తీసుకువచ్చిన ప్లాస్టిక్ సీసాలు, భోజనం ప్లేట్లు, ఇతర ప్లాస్టిక్ కవర్లు వంటివి అక్కడే విసిరేశారు. దీంతో ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చిన వారికి ఇవి ఇబ్బందికరంగా మారాయి. కనీసం వీటిని ఒక కవర్‌లో పెట్టి డస్ట్‌బిన్‌లో వేసి ఉంటే బాగుండేదని వారు వ్యాఖ్యానించుకున్నారు. అదే విధగా వీరు తిన్న తరువాత మిగిలిన పదార్థాలను అక్కడే వదిలేయండతో కుక్కలు తినేసి ప్లేట్లు, కవరలు చింపి పడేసాయి. వైఎంసిఏ ఉదురుగా ఉన్న ఫుట్ పాత్‌పై మద్యం సీసాలు దర్శనమిచ్చాయి. దీనికి నాలుగు అడుగుల దూరంలోనే పోలీస్ అవుట్ పోస్ట్ సైతం ఉంది. ఉదయాన్నే వాకింగ్‌కి బీచ్‌రోడ్డుకి వచ్చిన వారు పరిసరాలను అసహనం వ్యక్తం చేశారు.



వైఎంసీఏ ఎదురుగా ఫుట్‌పాత్‌పై మద్యం సీసాలు

శ్రీలలితాపీఠం క్యాలెండర్ ఆవిష్కరణ



శ్రీలలితాపీఠంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేనేజర్ కృష్ణసేన్, తదితరులు

సీతంపేట : అక్కయ్యపాలెంలో గల శ్రీలలితాపీఠం రూపొందించిన 2025 ఆధ్యాత్మిక క్యాలెండర్‌ను పీఠం దర్బారు హాలులో బుధవారం ఆవిష్కరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. పీఠం మొదటి పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస, రెండో పీఠాధిపతి అవ్యక్తనంద మహరాజ్, మూడో పీఠాధిపతి శివచిదానంద భారతీ స్వామి, ప్రస్తుత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి, శ్రీలలితాదేవి చిత్రాలతో క్యాలెండర్ చూడముచ్చటగా రూపొందించారు. భక్తులకు ఉచితంగా క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠం అర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సాక్షి, విశాఖపట్నం: జాతీయ రహదారిపై మద్దిలపాలెం దాటిన తర్వాత ఆటోమోటివ్ వద్ద బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నప్రసాద బాండ్ అందుకుంటున్న దాత జేఎస్ఎన్ రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పీఎం పాలేనికి చెందిన జేఎస్ఎన్ రాజు రూ.లక్ష 116ల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో అధికారులకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.